# సున్నితపు త్రాసు

- అంగులూరి అంజనీదేవి

"స్వప్నా! నా ఫ్రెండ్ ముందు నువ్వలా మాట్లాడటం నాకు నచ్చలేదు. వాడు చాలా సెన్సిటివ్. తను నమ్మినదాన్ని వేరెవరైనా కాదని వాదిస్తే వెంటనే అప్‌సెట్ అయిపోతాడు. ముఖ్యంగా వాడు మాట్లాడుతుంటే వినే వాళ్లంత మౌనంగా ఉండాలన్నదే వాడి సిద్ధాంతం" అన్నాడు శ్రీకాంత్.

ఆశ్చర్యపోయింది స్వప్నమాల.

"వాడీ రోజు మనింటికి రాకపోయినా బావుండేది. రేపు అదే బుక్‌పై మా ఆఫీసులో పెద్ద చర్చ లేవదీస్తాడు. వింటూ నేను ఫీలవ్వలేక చావాలి. అయినా నీకు నోటి దురుసు ఎక్కువ" అన్నాడు.

భరించలేకపోయింది.

"చూడండి! ఒక రచయిత రాసిన పుస్తకాన్ని లక్షల మంది చదువుతారు. ఎవరి అవగాహనకి అనుగుణంగా వాళ్లు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చుతారు. అందులో తప్పు లేదని నాగరికత తెలిసిన వాళ్లెవరైనా ఒప్పుకుంటారు. మీ ఫ్రెండ్ అప్‌సెట్ కావటం, మీరు నన్ను దండించటం - ఇదంతా ఏమిటో నా కర్థం కావటంలేదు" అంది.

"లాజిక్ మాట్లాడకు" అన్నాడు విసుగ్గా.

భర్త ముఖంలోని విసుగు చూడగానే బాధగా ఫీలయింది. ఫ్రెండ్ అభిప్రాయాలకి ఇచ్చిన ప్రాధాన్యతలంతనకి ఇవ్వలేదని గ్రహించింది.

"మొన్న మనం సినిమాకు వెళ్లినప్పుడు కూడా అలాగే చేశావు. మీ ఫ్రెండ్‌కు నచ్చిన సీన్‌ను నీకు నచ్చక మీ ఇద్దరి మధ్యా అప్పటికప్పుడే పెద్ద సుడిగాలి రేగేలా చేశావ్!" అన్నాడు.

"వాక్ స్వాతంత్ర్యం మనిషికి ఉన్నప్పుడు నన్ను గంగిరెద్దులా తల ఊపి సరిపెట్టుకొమ్మని సలహా ఇస్తున్నారు. నేను మీకు జంతువులా కనిపిస్తున్నానా?" అంది.

"ఎంతసేపు నీ మాటే నీకు వేదం. నీ అభిప్రాయమే నీకు ముఖ్యం. నీమీద నీకు అంత నమ్మకం ఉండటంలో తప్పు లేదు. కానీ నీ నమ్మకం ఎదుటి వ్యక్తిపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందో కూడా కాస్త గమనించాలి" అన్నాడు.

భర్త మాటకీ, తన మాటకీ జత కుదరదని అతనితో మాటలు పెంచటం ఇష్టంలేని దానిలా మౌనంగా కూర్చుంది.

"స్వప్నా! మాట ప్రభావం చాలా గొప్పది. ఎవరి విషయంలోనైనా మాట తేడా వస్తే మనసు భయంకరంగా నలిగిపోతుంది. అందుకే పెదవి జారేముందు కాస్త లౌక్యం తెలుసుకోవాలి. నీకు తొందరెక్కువ. ఆవేశం ఎక్కువ. నీకు ఏది నచ్చితే అది అందరికీ నచ్చాలని రెచ్చిపోతావు" అన్నాడు శ్రీకాంత్.

అతని మాటలు ఆమెను అవమానపరుస్తున్నట్లు, చులకన చేస్తున్నట్లు ఆమె గుండెలో గుబులు పుట్టించాయి. మౌనం వహిస్తే అతనింకా రెచ్చిపోయి తనని ఎందుకూ పనికిరాని వ్యక్తి కింద జమ కట్టేస్తాడని ఆమెకు తెలుస్తూనే ఉంది.

"చూడండి! ఇతరుల అభిప్రాయాలకి ప్రాధాన్యత ఇస్తూ నా అభిప్రాయాలను చంపుకోటానికి వాళ్లు కూడా నాలాగే సామాన్యులు. మేధావులు కాదు" అంది పౌరుషంగా స్వప్నమాల.

ఆమె అలా మాట్లాడుతుంటే ఎప్పుడూ రానంత కోపం వస్తోంది. శ్రీకాంత్ దేన్నైనా భరిస్తాడు కాని ఆఫ్ట్రాల్ తన అర్ధాంగి అయిన స్వప్నమాల తన మాట వినకుండా తనని ఎదిరించి మాట్లాడటాన్ని మాత్రం భరించలేకపోతున్నాడు.

"సామాన్యులంటూ, మేధావులంటూ, అభిప్రాయాలంటూ చంపుకు తింటున్నావు. చుట్టుపక్కల గృహ రాజకీయాల్లో తల దూర్చి, ఆఫీసు నుండి రాగానే నా బుర్ర వేడెక్కిపోయేలా చేస్తూ, నన్ను కాల్చుకు తింటున్నావు. అసలు నిన్నెలా అదుపులో పెట్టాలో నా కర్థం కావటంలేదు" అన్నాడు అసహనంగా.

ఆమె మనసు ఉడికిపోతోంది. తను వేసే ప్రతి అడుగు - తను పలికే ప్రతి పలుకు కరెక్టు అయినప్పుడు త నెందుకు భయపడాలి? భయపడితే తరిమే గుణం అభివృద్ధి అవుతుందట. దేన్నైనా భరిస్తుంది కాని గుప్పెట్లో పెట్టి బంధించాలని ప్రయత్నించటాన్ని మాత్రం భరించలేదు. కోపంగా భర్త వేపు చూసింది. చిలికి చిలికి గాలివాన అయినట్లు ఆ ఇద్దరి మధ్యా రోషావేషాలు-అసూయాద్వేషాలు పరాకాష్ఠ నందుకున్నాయి.

"తలుపుల చాటున మనుషులు దాక్కోటం, పెదవుల వెనకాల మాటల్ని దాచుకోవటం నాకు నచ్చదు" అంది స్వప్నమాల.

"ఇది జీవితం! మాటలు కాని, చేతలు కాని పరిధి దాటితే ప్రళయాన్ని సృష్టిస్తాయి. మనశ్శాంతిని నాశనం చేస్తాయి" అన్నాడు చాలా తీవ్రంగా.

"ఆ మాత్రం తెలివితేటలు నాకు లేవనా మీ ఉద్దేశం?" అంది ఆవేశంగా.

"అయితే నీ పద్ధతి మార్చుకో వన్నమాట!" అన్నాడు. ఏదో ఒకటి తేల్చి చెప్పు త్వరగా అన్నట్లుంది అతని ధోరణి.

"నాకు నచ్చిన పద్ధతులు మీకు నచ్చనప్పుడు మీ మాటలు నే నెందుకు వినాలి?" అంది. నా తుది నిర్ణయం ఇదే అన్నట్లుంది ఆమె మాట్లాడిన తీరు.

"నువ్వు నా దగ్గర భార్యలా మెలగటం లేదు. ప్రత్యర్థిలా వ్యవహరిస్తున్నావు. ఇక నిన్ను భరించటం నావల్ల కాదు. నీ దారి నీది. నా దారి నాది" అంటూ తెగేసినట్లు చెప్పి బయట కెళ్లిపోయాడు శ్రీకాంత్.

ఆశ్చర్యపోతూ చూసింది స్వప్నమాల. అతనామె చెంపమీద కొట్టకపోయినా మనసుమీద కొట్టాడని ఆమెకు తెలుస్తూనే ఉంది.

ఇన్నాళ్లూ... కాపురం అంటే సున్నితపు త్రాసు అనుకొంది. భార్యా, భర్త సమాన భావాలతో కలసి అల్లుకునే నవ్వుల పందిరి కింద పువ్వుల కుప్పల్ని పోగుచెయ్యటమంత తేలికైన అంశం అనుకొంది. కానీ అప్పటి తన కలలకీ, ఇప్పుడు నడుస్తున్న తన కాపురానికీ చాలా తేడా అగుపిస్తోంది. తన ప్రతి కదలికలో భర్త ఆలోచనలు చోటు చేసుకుంటున్నాయి. నిద్ర లేచేటప్పటి నుండి అతని ఆంక్షలు, ఆదేశాలు విని విని చెవులు తూట్లు పడుతున్నాయి. అతనిలాగే తను కూడా ఈ సంఘంలో పెరిగిన వ్యక్తిలా భావించటంలేదు. వ్యక్తిత్వం ఉన్న మనిషిలా చూట్టంలేదు. అడవిలో నుండి తప్పించుకువచ్చిన జంతువులా భావిస్తున్నాడు. పురుషాధిక్యంతో పేట్రేగిపోతూ, భార్య అంటే తన అహంకారపు నీడలో నివసించే మైనపు బొమ్మ అనుకుంటున్నాడు. ఆలోచనలు నేర్పుతున్నాడు. అభిప్రాయాలు నేర్పుతున్నాడు. చివరకు అభిరుచులు కూడా అతనివే ఉండాలని కోరుతున్నాడు. ఇదెక్కడి న్యాయం? అనుకుంది స్వప్నమాల.

ఎక్కడో మనసు పొరల్లో దాగి ఉన్న ఆత్మాభిమానం ఒళ్లు విరుచుకొని అప్పుడే నిద్ర లేచిన దానిలా ఆమెను కలవరపెట్టింది.

వెంటనే తల్లీ, తండ్రి గుర్తొచ్చారు. వాళ్ల ఊరు వెళ్లాలంటే గంట ప్రయాణం చెయ్యాలి. వెళ్లేందుకు సిద్ధమైంది.

** ** **

రైల్లో కూర్చుని ప్రయాణం చేస్తున్న స్వప్నమాలకి తన ఫ్రెండ్ ప్రీతి గుర్తొచ్చింది. వెంటనే పుట్టింటి ప్రయాణం రేపటికి వాయిదా వేసుకొని ప్రీతికోసం విజయవాడలో దిగింది.

గేటు చప్పుడు విని ముందు హాల్లో కూర్చుని ఉన్న రవీంద్ర కళ్లు తెరచి చూశాడు. అతను కుర్చీలో కూర్చుని నిద్రపోతూ తనని చూసి లేచినట్లు గమనించింది స్వప్నమాల.

"ఈ మహానుభావుడికి ఇంకా ఉద్యోగం వచ్చినట్లు లేదు" అనుకుంటూ రవీంద్రను సమీపించింది.

"ప్రీతి ఆఫీసునుండి రాలేదాండి?"

"వచ్చే టయమైంది. కూర్చోండి!" అంటూ కుర్చీ చూపించాడు రవీంద్ర.

స్వప్నమాల కుర్చీలో కూర్చుంటుండగా, గేటు దగ్గరనుండే గమనించి నన్నగా నవ్వుతూ లోపలకి వచ్చింది ప్రీతి.

"వస్తున్నట్లు తెలియజెయ్యకుండా ఊడిపడ్డావ్! ఏమిటి స్వప్నా విశేషం?" అంటూ ప్రేమ నిండిన కళ్లతో స్నేహితురాలి వేపు చూసింది ప్రీతి.

"చూడా లనిపించి వచ్చాను" అంటూ అందంగా నవ్వి, ప్రీతి వెంట లోపలకి వెళ్లింది స్వప్నమాల.

రవీంద్ర ఒక్కడే ముందు హాల్లో మిగిలిపోయాడు.

ఆ ఇల్లంత కలియజూసింది స్వప్నమాల. ఎక్కడ సామాన్లు అక్కడ చిందరవందరగా పడి, అసహ్యంగా అనిపిస్తూ చిరాగ్గా ఉంది.

చదువుకుంటున్న రోజుల్లో తన క్లాస్‌మేట్స్ అందరికన్నా ప్రీతి అందంగా ఉండేది. అపురూపమైన భావాలు ఆమె ముఖకవళికల్లో ఉట్టిపడుతుండేవి. ప్రీతి అందంగా ఉండేది. డల్‌గా తయారైంది. పెళ్లి అయ్యాక ఉండాల్సిన థ్రిల్ కాస్త ప్రీతి పాలిట 'హెల్' అయిందా?

ఆలోచిస్తూ ఉన్న స్వప్నమాలకి కాఫీ కప్ అందించి, భర్త దగ్గర కెళ్లి ఓ కప్పు ఇచ్చి, తను కూడా ఓ కప్పు పట్టుకొని స్వప్నమాల దగ్గరికి వచ్చింది ప్రీతి. కాఫీ తాగాక కాస్త శక్తి వచ్చినట్లై ఇంటి పనిలో మునిగిపోయింది ప్రీతి.

"ప్రీతీ! నువ్వలా చక్రంలా తిరుగుతుంటే నాకు కళ్లు తిరుగుతున్నాయి. మాటలు లేని నాటకాన్ని చూస్తున్న మూగ ప్రేక్షకురాలిలా ఇంకా ఎంతసేపు నాకీ 'పనిష్‌మెంట్?' రాక రాక వచ్చాను. ఏదో ఒకటి మాట్లాడు" అంది స్వప్నమాల.

"సారీ! స్వప్నా! పనితో ఊపిరి సలపటంలేదు. పొద్దున ఆయన ఫ్రెండ్స్ నలుగురు వచ్చారు. మనకి పనివేళ కదాని వాళ్లని నిర్లక్ష్యం చెయ్యటం సభ్యత కాదు. అందుకే పొద్దుటి పని ఇప్పటికి వాయిదా పడింది. అవసరనిమిత్తం ప్రతి వస్తువు స్థానభ్రంశం చెందాయి. ఆఫీసు నుంచి వచ్చే నాకోసం ఎదురుచూస్తున్నాయి. ఏమిటో స్వప్నా! ఆఫీసులో ఫైల్స్ తిరగెయ్యటం, ఇంటి కొచ్చాక ఈ పనితో స్వారీ చెయ్యటం తప్పనిసరి అయిపోతోంది" అంటూ ఆత్మీయురాలైన స్వప్నమాలతో తన ధినచర్యను అతి సహజంగా చెప్పింది ప్రీతి.

ప్రీతి మాటలు వినగానే స్వప్నమాలలో ఉన్న అభిమానం కరిగి నీరై సానుభూతి స్థానంలోకి రూపాంతరం చెందింది. సానుభూతి కాస్త ముదిరి ఆవేశంగా మారింది.

"నీ పరిస్థితి చాలా మారిపోయింది ప్రీతీ! ఇలాగైతే నీ ఒంట్లో ఉన్న పార్ట్స్ అన్నీ చాలా త్వరగా అరిగిపోయే అవకాశం ఉంది" అంది స్వప్నమాల.

తల వంచుకొంది ప్రీతి.

"ప్రీతీ! ఎక్కడైనా భర్త ఆఫీసు నుండి వచ్చే లోపల ఇంటి పని నిర్వర్తించటం భార్య ధర్మం. మరి భార్య ఆఫీసు నుండి వచ్చే లోపల ఇంటి పని చూడటం భర్త కూడా తన ధర్మంగా భావిస్తే నామోషి అవుతుందా? రవీంద్రగా రలా టైం వేస్ట్ చేస్తూ కుర్చోకపోతే, మానవత దృష్టితో నీకు హెల్ప్ చెయ్యాలని ప్రయత్నిస్తే తప్పు కాదుగా!" అంది స్వప్నమాల.


ఉలిక్కిపడుతూ చూసింది ప్రీతి.

ఎంత నెమ్మదిగా మాట్లాడినా రవీంద్రకి వినిపించే అవకాశం ఉంది. వింటె అతను ఫీలవుతాడని ప్రీతి భయపడింది. స్వప్నమాల అలాంటి భయాలేమి లేనిదానిలా తన ధోరణిలో తను మాట్లాడుతోంది.

"నిన్ను చూస్తుంటే సరదాలతో, సంతోషాలతో మునిగి తేలుతున్న లక్షణాలేమీ కనిపించటం లేదు. ఇంత చిన్న వయసులోనే నీలో మునుపటి ప్రీతి మాయమై, బ్రతికేది కేవలం పని కోసమే నన్నట్లు యాంత్రికంగా మారిపోయావు. మనం ఎంత చదివినా, ఎంత ఎదిగినా ఈ మగవాళ్లు మాత్రం బానిసల్లాగే చూస్తున్నారు" అంది.

ఉద్యోగం చేస్తున్నానన్న అహంతో స్నేహితురాలిచేత తనే అలా మాట్లాడిస్తోందని భర్త అపోహ పడతాడని ప్రీతి గుండెలు దడ దడ మంటున్నాయి. పదాల గారడీతో వాక్యాలను ఎంత సంస్కారయుతంగా సాగదీసినా అందులోంచి వెలువడే అర్థాలు కొన్ని సందర్భాల్లో మనిషిని పైనబడి బాదుతున్నంత పని చేస్తాయి. ఎలాగైనా ఆమె మూడ్‌ని మార్చాలని స్వప్నమాల వేపు నవ్వుతూ చూసింది ప్రీతి.

"స్వప్నా! తృప్తి, సంతోషం అనేవి పైకి కనిపించవు. గుప్పెటంత గుండెలో నిగూఢంగా దాగి ఉంటాయి. అయినా ఇప్పుడు నాకేం తక్కువయిందని నువ్విలా మాట్లాడుతున్నావు. నేను చాలా ఆనందంగా ఉన్నాను" అంది ప్రీతి.




ఇంటి పనితో, ఆఫీసు పనితో సతమతమవుతూ తన అవసరాలే కాక, రవీంద్ర అవసరాలు కూడా తీర్చుతూ, రవీంద్రకి 'కీ' ఇచ్చి వదిలే బొమ్మలా మారిపోయి తనెంతో ఆనందంగా ఉన్నానని, తృప్తిగా జీవిస్తున్నానని ప్రీతి మాట్లాడుతుంటే స్వప్నమాలకి నవ్వు వచ్చింది. కదిలి కదిలి నవ్వింది.

ఆమె కళ్ళముందు సున్నితపు త్రాసు మెదిలింది. ఆ త్రాసులో - రవీంద్ర ఉన్న వేపు కిందకి వంగి మొగ్గు చూపితే ప్రీతి ఉన్న వేపున పైకి తేలుతూ అగుపిస్తోంది.

"ప్రీతీ! పైకి చెప్పుకోలేని అభిప్రాయాలు లోలోన మెలిపెడుతున్నా ఎదుటి వ్యక్తిని ధైర్యంగా ప్రశ్నించలేని నిస్సహాయతతో... ఏదైనా ఒక భావం మనసులో మెదిలితే దాన్ని కార్యరూపంలోకి తేవటం సాధ్యం కాదేమోనన్న నిరాశతో... ఒక కోరిక మనసులో నలుగుతున్నా దాన్ని బయటపెట్టటం సబబు కాదేమోనన్న సంశయంతో... రోజంతా నటిస్తూ బ్రతకాలంటే ఏదో పోగొట్టుకున్నంత వెలితిగా ఉంటుంది కదూ! ఎక్కడికక్కడ సర్దుకుపోతూ బ్రతికే వాళ్లంతా శవాల్లా అగుపిస్తారు కదూ!" అంది జీవిత సత్యాన్ని చెబుతున్నంత ధీమాగా.

"స్వప్నా! నీ మాటలతో నన్ను హింస పెట్టకు. జీవితంలో నే నింకా ప్రథమ స్థానంలోనే ఉన్నాను. అనుభవించాల్సింది చాలా ఉంది. నేను ఆశాజీవిని" అంది ప్రీతి.

"ఈ రోజంతా నీతో గడపాలని, నువ్వింకా అప్పటి ప్రీతివేనని ఆశపడ్డాను. కానీ నిన్ను చూస్తుంటే జాలి తప్ప ఇంకేం అనిపించటంలేదు. ఇలాంటి వాతావరణం నాకు నచ్చదు" అంటూ ఏం చెప్పినా వినిపించుకోకుండా అప్పటికప్పుడే స్టేషన్ వేపు బయలుదేరింది.

రైలు రాగానే వెళ్లి కూర్చుంది.

రైలు వేగాన్ని అందుకొంది.

జారుడు బండపై నీటి ధారలా కాలం జారిపోతుంటే వ్యక్తిత్వాన్ని ఆత్మాభిమానాన్ని ఆలోచనల్ని క్షణానికో విధంగా జారవిడుచుకుంటూ తాము చేసేదే నిజమైన కాపురమని మురిసిపోతున్న ప్రీతి లాంటి వాళ్లకి - కాలం విలువ, జీవితం విలువ, అభిప్రాయాల విలువ తెలిసే దెప్పుడు? అనుకొంది స్వప్నమాల.

** ** **

స్వప్నమాలను చూసి సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు శారదాంబ, రాజారావు.

"ఒక్కదానివే వచ్చావేం స్వప్నా! అల్లుడుగారు ఏదైనా పని ఉండి ఆగిపోయారా? వస్తున్నట్లు ఉత్తరం రాయలేదేం?" అని ఆత్రతగా అడుగుతున్న తల్లిదండ్రుల వేపు జవాబు దొరకని దానిలా చూసింది స్వప్నమాల.

శారదాంబ గుండెలో రాయి పడినట్లైంది.

రాజారావు మౌనంగా చూశాడు.

రోజులు దొర్లిపోతున్నాయి.

రాజారావు కోర్టుకి వెళ్తే, శారదాంబ పనిలో మునిగిపోతే - స్వప్నమాల ఒంటరిగా ఫీలవుతూ

కాలక్షేపం కోసం తహ తహ లాడుతోంది. శ్రీకాంత్ నుంచి ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు.

కోర్టునుండి వచ్చిన భర్తకి కాఫీ కప్ అందించి, అతనికి ఎదురుగా కూర్చుంది శారదాంబ.

"నేను చెప్పిన విషయం గురించి ఏమాలోచించారు?" అడిగింది శారదాంబ.

ఏమీ ఆలోచించలేదు అన్నట్లుగా తల ఊపాడు.



"ఆలోచించరు. మీ రెందు కాలోచిస్తారు! ఇన్నేళ్ళ మన జీవనగమనంలో నా ఆలోచనల్ని మీ రెప్పుడు పట్టించుకున్నారు! నా మాటకి ఎప్పుడు విలువ ఇచ్చారు. నేను మీ దారిలో నడవటమే కాని మీరు నా దారిలో ఎప్పుడు నడిచారు. మనదంతా పాత సీసాలో పాత సారా పోసిన రకం. ఏ విషయంలోనైనా ఏకాభిప్రాయం ఏడ్చి చచ్చిందా? అంది.

"ఇప్పుడు నీకేం తక్కువైంది శారదా? ప్రాణానికి ప్రాణంగా, నా ప్రాణం కన్నా ఎక్కువగా చూసుకుంటున్నాను. భర్తగా నీకు చెయ్యాల్సినవన్నీ చేస్తున్నాను. నీ పట్ల నే నెప్పుడూ అన్యాయంగా ప్రవర్తించలేదు. మ రిప్పు డెందు కింత అసంతృప్తిగా మాట్లాడుతున్నావో అర్థం

కావటం లేదు" అన్నాడు.

పక్క రూంలో ఉన్న స్వప్నమాలకి చదువుతున్న నవల మత్తు కాస్తా దిగిపోయింది. తను వింటున్నది నిజమా? అబద్ధమా? అన్నంతగా ఆశ్చర్యపోయింది.

ఏనాడూ నోరెత్తని తన తల్లి ఈనా డింత ఖచ్చితంగా, నిర్భయంగా తనలోని అసంతృప్తి భావాన్ని బయటపెడుతుంటే, తండ్రి మాత్రం ఇంకా తనని తను సమర్థించుకుంటూ, తల్లిని మభ్యపెట్టాలని చూస్తున్నాడు.

అంటే? తన తల్లి కూడా సర్దుబాట్లతో, దిద్దుబాట్లతో ఇన్నాళ్లూ యాంత్రికంగా గడిపిందా? జీవితం, వ్యక్తిత్వం, ప్రపంచం అన్నీ తన భర్త నీడలోనే ఉన్నాయని నమ్మి ఎంతో సాధ్విలా బ్రతికిన వాళ్లంతా చివరి జీవితంలో ఇలాగే రంకెలు వేస్తారా? ఆనందం, కన్నీళ్లు, భవిష్యత్తు భర్తతోనే ముడి పెట్టుకొని భర్త అడుగులో అడుగు వేస్తూ అభిప్రాయాలను, అభిరుచులను, స్వేచ్ఛను అతని అడుగుల కింద సమాధి చేస్తూ, అతను చేసే తప్పుల్ని భరిస్తూ, 'సెంటిమెంటల్ ఫూల్స్'లా జీవిస్తూ బ్రతుకు చివర్లో ఇలాగే ప్రశ్నిస్తారా? ఎవరైనా ఇంతేనా? సహజత్వం లేని ఇలాంటి సహజీవన యానం వల్ల ఒరిగేదేమిటి?

ఏ ఇల్లు చూసినా, ఏ ఇల్లాల్ని చూసినా ఏమున్నది గర్వకారణ మన్నట్లు స్వప్నమాల మనసంతా కలచివేసినట్లైంది.

"న్యాయవాదిగా కోర్టులో అడుగు పెట్టిన క్షణంనుండి న్యాయం, ధర్మం అంటూ నీతిసూత్రాలను జపించుకుంటూ సత్యాన్వేషణతోనే కాలాన్ని వెళ్లదీశారు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఆ దారాసింగ్ కేస్ ఒప్పుకోండి. కనకవర్షం కురుస్తుంది" అంది శారదాంబ.

"అది చాలా వరస్ట్ కేసు శారదా! నన్ను బలవంతపెట్టి ఆ రొంపిలోకి దించాలని చూడకు. మరీ అంత కక్కుర్తి పడేంత దరిద్రంలో లేము" అన్నాడు రాజారావు.

"మీ కలాగే అనిపిస్తుంది. అసలు డబ్బు విలువ తెలిస్తేగా" అంది.

బరువుగా నిట్టూర్చాడు రాజారావు.

డబ్బుకోసం తల్లి ఎందు కంత బలవంతపెడుతోందో స్వప్నమాలకి అర్థం కాలేదు. తండ్రి కష్టపడి సంపాదిస్తుంటే తల్లి తన పుట్టింటి వాళ్లకి సమర్పిస్తోందనీ, ఇంకా చాలక తండ్రిని ఊబిలోకైనా దించాలని పూనుకుందనీ స్వప్నమాల గ్రహించింది. ఇకపై తల్లి ప్రయత్నాలు సాగనివ్వకూడ దనుకొంది. దారాసింగ్ కేసులోని అధర్మాన్ని భరించలేక కోర్టు ప్రాంగణంలో తండ్రి గుండె ఆగిపోయినట్లు కళ్లముందు కదలటంతో తల్లడిల్లిపోయింది.

"ఈ వీధిలో మన స్వప్నతోటి అమ్మాయి లందరికీ పెళ్లిళ్లయ్యాయి. బోలెడంత కట్నాలతో భర్తల వెంట వెళ్లి ఎంతో గుట్టుగా కాపురాలు చేసుకుంటున్నాను. మన స్వప్నను గమనిస్తున్నారా! నాలుగు రోజుల కోసారి భర్తను వదిలి పరిగెత్తుకొస్తోంది. ఒక ఆడది భర్తను వదిలి పుట్టింట్లో నిమ్మళంగా ఉంటోందంటే ఆ భార్యాభర్తల మధ్య ఎలాంటి గొడవలూ లేవని నమ్మకం, ఆత్మవంచన" అంది.

"అడిగి తెలుసుకోవలసింది శారదా! నాకంటే నీ దగ్గరే స్వప్నకి చనువెక్కువ" అన్నాడు.

"ఎంత చదువున్నా స్వప్నకి అభిమాన మెక్కువండీ! బయటపడే రకం కాదు. ఎన్ని రకాలుగా ప్రశ్నించి చూసినా పెదవి కదవటంలేదు. మౌనంగా ఏదో పోగొట్టుకున్నదానిలా ఉంటోంది. నా కేదో అనుమానంగా ఉంది."

"ఒక్క పైసా కూడా కట్నం ఆశించకుండా స్వప్న మెడలో తాళి కట్టిన శ్రీకాంత్‌ని అనుమానించటంలో అర్థం లేదు. అతని స్వభావం నాకు తెలుసు. ఎలాంటి పరిస్థితిలో కూడా ఎదుటి వ్యక్తిని నొప్పించడు. నా కా నమ్మకం ఉంది" అన్నాడు.

మూతి మూ డొంకర్లు తిప్పింది శారదాంబ.

భర్త కళ్లలోకి తీక్ష్ణంగా చూసింది.

భార్య చూపుల దాటికి తట్టుకోలేక, తన చూపుల్ని మరోవేపుకు తిప్పుకున్నాడు. అంత తీవ్రంగా చూసి శ్రమ పడకపోతే విషయ మేమిటో సూటిగా చెప్పొచ్చుగా అని లోలోన గొణుక్కున్నాడు.

"ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతి ప్రకారం మామల్ని నంజుకుతినే అల్లుళ్లున్న మన సొసైటీలో ఆదర్శం తట్టుకోలేదు. కొత్త మోజులో పొగడ్తలు రుచి మరిగి ఆ రోజు పెళ్లి పందిట్లో శ్రీకాంత్ కట్నం వద్దన్నాడని మురిసిపోయారే కానీ, స్వప్న గురించి మీ రాలోచించలేదు. అతని చేతిలో మన స్వప్న అష్టకష్టాలు పడుతోంది. మనతో చెబితే మనం భరించలేమని తనలో తనే కుమిలిపోతోంది. నాది తల్లి మనసండి! స్వప్న కేదైనా అయితే నేను తట్టుకోలేను" అంటూ కళ్ల నీళ్లు పెట్టుకొంది శారదాంబ.

ఆలోచిస్తూ కూర్చున్నాడు రాజారావు.

తన రాక తల్లిలో ఇలాంటి అపోహను పుట్టిస్తుందని ఊహించని స్వప్నమాల అయోమయంలో పడిపోయింది.

"దారాసింగ్ కేసులోని లొసుగుల్ని ఆలోచిస్తూ కూర్చోకుండా అతనిచ్చే డబ్బు తీసుకెళ్లి శ్రీకాంత్‌కి ఇచ్చి రండి! వచ్చి స్వప్నను తీసుకెళ్తాడు. లేకపోతే... స్వప్న మాటి మాటికి ఇలా వచ్చి ఉండటంతో ఈ వీధి ఆడవాళ్లకి నేను లోకువగా కనిపిస్తున్నాను. వాళ్లు వేసే చెత్త ప్రశ్నలకి జవాబులు చెప్పలేక ఛస్తున్నాను. అసలే వాళ్ల నోళ్లు మంచివి కావు. వయసులో ఉన్న స్వప్న భర్తను వదిలి ఇలా రావటం మన పరువుప్రతిష్ఠలకి అంత శ్రేయస్కరం కాదు" అంది.

స్వప్నమాలకి ఒళ్లంతా కాల్చి పెట్టి, ఆ కాల్లపై నిమ్మరసం పూసినంత బాధగా ఉంది. కొన్ని కొన్ని సందర్భాల్లో స్త్రీకి మరో స్త్రీ ఇచ్చే గౌరవ మర్యాదలు ఇంత దిగజారుతూ కనిపిస్తాయని ఇప్పుడే అర్థమైనదానిలా తల పంకించింది. ఒక స్త్రీలో ఉన్న సాహసం - ఆలోచనా విధానం ఇంత బలహీనంగా ఉండబట్టే మరో స్త్రీకి స్వేచ్ఛా జీవనం అందుబాటులోకి రాక ఎదురుతిరిగే మనసుతో రాజీ పడలేక విలవిల్లాడుతోంది. త నిప్పు డేం చెయ్యాలి?

"చెప్పండి! కేసు ఒప్పుకుంటారా? నన్ను మా పుట్టింటికి వెళ్లిపొమ్మంటారా?" అంటూ తొందరపెడుతోంది శారదాంబ.

తల్లి పెట్టే తొందర చూస్తుంటే ఆ కేసును ఒప్పుకోక తప్పేటట్టు లేదు. తనవల్ల తండ్రి తన వ్యక్తిత్వాన్ని బలిపెట్టుకోవటం స్వప్నమాలకి ఇష్టం లేదు.

ఆమె కళ్లముందు ఎప్పటిలా సున్నితపు త్రాసు కాకుండా తన భర్త శ్రీకాంత్ మెదిలాడు.

కట్నం కోసం భార్యల్ని హింసించే భర్తలు, ఎన్ని బాధల్ని అయినా మౌనంగా భరిస్తూ, మొండి జీవాల్లా భర్త అడుగులకు మడుగులొత్తే భార్యలు నాలుగు గోడల మధ్య తా మేదో ఉద్ధరిస్తున్నా మన్నంత గుంభనగా నివసిస్తుంటే - తను మాత్రం ప్రతి చిన్న విషయానికి చలించి భర్తను సాధించి, తన మాటకే ప్రాధాన్యత ఉండాలని, ఆ ప్రాధాన్యతేదో ఇతరులు కూడా ఒప్పుకునేలా ఉండాలని పట్టుబట్టి వేధించేది. కాస్త నిలకడగా ఆలోచిస్తే - చాలామంది స్త్రీల కన్నా తనే అదృష్టవంతురాలిగా భావించి తృప్తిగా ఫీలయింది. మనసు చివుక్కుమన్నప్పుడల్లా సంసారపు విలువల్ని సున్నితపు త్రాసులో తూచి ఒంటరి ప్రయాణిలా బయట పడకూడదని నిర్ణయించుకొంది.

"అమ్మా! నేను మా ఇంటికి వెళ్తున్నాను" అంటూ తల్లి ఎదుట నిలబడింది స్వప్నమాల.

నివ్వెరపోయింది శారదాంబ.

"ఇప్పు డంతవసర మేమొచ్చింది స్వప్నా! అతనికి లేని బాధ నీ కెందుకు! ను వ్విలా వెళ్తే లోకువైపోతావు. నాన్నతో అన్ని విషయాలు మాట్లాడాను. వచ్చి తీసుకెళ్తాడులే!" అంది శారదాంబ.

తల వంచుకొంది స్వప్నమాల.

శారదాంబలో ఏదో బాధ లాంటిది తన్నుకొచ్చింది. తన కూతు రలా తల వంచి నిల్చోవటం భరించలేకపోయింది.

"స్వప్నా! కొందరు మగవాళ్ల మాటలకీ, చేతలకీ పొంతన ఉండదు. అలాంటి మగవాళ్ల అహంకారపు ఆయుధాలకి ఎలాంటి స్త్రీలు అయినా బలి కావలసిందే. కానీ నువ్వు అలా కాకూడ దమ్మా! నీకు మేమున్నాము. నువ్వు అనాథవు కావు. సర్దుకుపోయి బ్రతకటానికి" అంది ఆవేశంగా.

చివుక్కున తలెత్తి చూసింది స్వప్నమాల.

"మీరు ఊహించినంత నీచస్థితిలో మావారు లేరు. పెద్ద గీత చుట్టూ చిన్న గీతలు కూడా ఉన్నాయని స్పష్టంగా తెలిసినప్పుడే పెద్ద గీతకు గొప్పతనం వస్తుంది. ఆయన విలువ నా కిప్పుడే అర్థమైంది. వస్తానమ్మా!" అంటూ బయలుదేరింది స్వప్నమాల.

ఆశ్చర్యంతో, ఆనందంతో శారదాంబ కళ్లు ఆవులించాయి. ★